క్లుప్తంగా

నేడు వాహన వేలం

పూతలపట్టు: ఎక్సైజ్ కేసులో పట్టుబడిన వాహనాన్ని బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టాటా సుమో ధర 1,35,000 రూపాయలుగా నిర్ణయించి, ఆదివారం ఉదయం 11 గంటలకు పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

నాగంవాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్


పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హవనం విజయవంతం చేద్దాం

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనం పూజలను విజయవతం చేద్దామని కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కోరారు. ఆలయ సమావేశపు మందిరంలో శనివారం పాలక మండలి సభ్యులతో సమావేశమయ్యారు. చైర్మన్, ఈఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ దేవాలయంలో నిర్వహించని లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనమును మార్చి 3, 4, 5 తేదీల్లో విశాఖ శారద పీఠాధిపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజాధి కార్యక్రమాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేయాలని ఎంపీపీ కుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. 90 రోజుల తరువాత నిర్వహించిన సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలందరూ హాజరయ్యారు. ఆయా ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిలో ప్రధానంగా శ్మశాన వాటికకు దారి, కరెంట్ స్తంభాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణంపై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గంగయ్య. వయసు 50 ఏళ్లు, పూతలపట్టు మండలం, తేనేపల్లి ఎస్టీ కాలనీకి చెందిన ఈయనకు ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె. కుటుంబ సభ్యులు కలిసి 20 ఏళ్ల నుంచి ఈత ఆకులతో ఇంటికి అవసరమైన చీపుర్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇదే వీరికి జీవనాధారం. ఈ చీపుర్లను పక్క రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందుతున్నారు. ఈ పని ఈయన ఒక్కరే చేయడం లేదు. గ్రామం మొత్తం ఇలాంటి పనులే చేస్తున్నారు. అదే ఆ ఊరి ప్రత్యేకం.

ఈత కొమ్మలను సులభంగా వంచే యంత్రం



అల్లకం.. ఊరికి జీవనాధారం

- ఊరంతా అల్లకమే వృత్తి
- ఈతాకులతో చీపుర్లు, బుట్టల తయారీ
- తమిళనాడులో విక్రయం

పూతలపట్టు: ఒకప్పుడు ఎక్కడ చూసినా ధాన్యం నిల్వకు అవసరమైన బుట్టలు, గంపలు, గాదెలు వెదురు, ఈత ఆకులతో తయారు చేసుకునే వాళ్లు. ప్రకృతి సహజంగా ఎటువంటి కాలుష్యం లేకుండా


గంపలు అల్లుతున్న మహిళలు

హాయిగా జీవనం కొనసాగించే వాళ్లు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్లాస్టిక్‌తో తయారైన వస్తువులు మన దేశంలోకి వచ్చేశాయి. ఆకులతో చేసిన బుట్టలు, గంపలు, చీపుర్లు కనుమరుగైపోయాయి. అయితే ఈ ఆధునిక యుగంలోనూ ఓ గ్రామం మొత్తం ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తోందంటే ఆశ్చర్యపడాల్సిందే.

మండలంలోని తేనేపల్లిఎస్టీ కాలనీలో 24 కుటుంబాలు ఉండగా ఊరు మొత్తం జీవనోపాధి కోసం అల్లకం వృత్తినే ఎంచుకున్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఇంటికి ఉపయోగపడే చీపుర్లు, గంపలు, బుట్టలు తయారుచేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో తయారు చేసి వాటిని పొరుగు రాష్ట్రమైన తమిళనాడుకు తరలించి, విక్రయిస్తున్నారు. ఈ చీపుర్లను ఎండిపోయిన ఈత ఆకుతో తయారుచేస్తున్నారు. అందరూ వారు స్వయం కృషితో జీవనం సాగిస్తున్నారు. ఈత కొమ్మలను తెచ్చి వాటితో గంపలు తయారు చేస్తారు. ఆ కొమ్మలు సులువుగా వంచడానికి వారే స్వయంగా ఒక యంత్రాన్ని తయారుచేసుకున్నారు. తద్వారా గంపల తయారీలో ఉపయోగపడే మృదువైన కర్రలుగా మలుస్తారు. దీని ద్వారా గంపలను సులువుగా అల్లుతారు. అంతేకాదు బయటి నుంచి ప్లాస్టిక్ తీగలు తెచ్చి వాటితో రంగురంగుల బుట్టలు తయారు చేసి అమ్ముతుంటారు. అంతేకాక కొంత మంది రకరకాల బొమ్మలను కొనుక్కొచ్చి వాటిని అమ్ముతుంటారు.

40 ఏళ్లుగా ఇదేపని



ఇదే మాకు కూడు పెట్టేది. ఇంటి దగ్గర ఎవ్వరూ ఖాళీగా ఉండము. పిల్లా, పాపలతో సహా కష్టపడి తేనే మాకు నాలుగు డబ్బులు వస్తాయి. ఈ అల్లకమే ఎంతో కొంత కూడు, గుడ్డ పెట్టి మా అవసరాలను తీర్చుతోంది. 40 ఏళ్లుగా ఇదే పని చేస్తున్నాం. వేరేపని మాకు రాదు. ఇంకేం చేస్తాం. ఇప్పటికైతే ఏం డోకా లేదు.

–కె.పెద్దెమ్మ, తేనేపల్లి ఎస్టీ కాలనీ

గంపలు తయారు చేస్తాం



మాకు తొలుత పెట్టుబడికి ప్రభుత్వం డ్వాక్రా ద్వారా లోను మంజూరు చేసింది. అది మాకు ఎంతో ఉపయోగపడింది. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను కట్టుకుంటున్నాం. అది పూర్తయితే సొంతిల్లు ఉన్నటే. ప్రభుత్వం మమల్ని గుర్తించి మాకు మేలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా.

– ఎస్.నాగమ్మ, తేనేపల్లి ఎస్టీకాలనీ

అల్లడం కష్టమే

గంపలు, బుట్టల అల్లడం అంత సులువైన పని కాదు. ఎంతో నైపుణ్యం కూడిన చేతి వృత్తి ఇది. గంప పరిమాణాన్ని బట్టి ఈత బద్దల మందము ఉంటుంది. ఈ గంపలు అల్లడం చాలా ప్రమాదకరమైన పని. ఏమరుపాటుగా ఉంటే ఈత బద్దలు చేతులు, కాళ్లలోకి కోసుకుపోయే అవకాశం ఉంది. గతంలో ఈతతో చేసిన గంపలు, బుట్టలు, బొమ్మలు అంటే పల్లె, పట్టణం తేడా లేకుండా అందరూ వినియోగించే వాళ్లు. కాలక్రమంలో చోటుచేసుకున్న మార్పులతో వాటి వినియోగం తగ్గింది.

కష్టపడితే ఫలితం

ఈతతో చేసిన చీపురు, గంపలు, బుట్టలు విక్రయిస్తే కష్టానికి తగ్గ ఫలితం ఉంటుంది. ఒక కుటుంబం 10రోజులకు ఒకసారి సుమారు 150 చీపురు కట్టలను తయారు చేసి తమిళనాడులోని వివిధ పట్టణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. ఈ పనిని వీరు 20 ఏళ్ల నుంచి చేస్తున్నారు. ఒక కుటుంబం ఒక రోజుకు 3 నుంచి 4 గంపలు తయారు చేస్తుంది. వీరు ఒక గంపను రూ.200 చొప్పున అమ్ముతున్నట్లు తెలిపారు. వీరు ఈ వృత్తిని 40 సంవత్సరాల నుంచి కొనసాగిస్తున్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈఈ శేషాద్రి తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, నగరంలోని అన్ని సర్వీసులు కలిపి 64 వేలు ఉండగా, రోజు 10 లక్షల యూనిట్లు వినియోగిస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలం సమీపిస్తుండడంతో మార్చి నుంచి 11 లక్షలకు పైగా యూనిట్లు వాడకం ఉంటుందన్నారు. అందుకు తగినట్లు విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కువగా ఉదయం 6–9, సాయంత్రం 8–9 గంటల మధ్య వాడకం ఎక్కువగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు పది ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ చూడాలన్నారు. సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయించాలన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు


పెట్రోల్‌బంక్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్

గుడిపాల: మండలంలోని పలు పెట్రోల్ బంకులను శనివారం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గుడిపాల, చీలాపల్లె, మద్రాస్‌క్రాస్‌రోడ్డు బంకుల్లో నీటి సౌకర్యం సరిగ్గా ఉందా, పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయా లేదా పరిశీలించారు. మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతో వారిని మందలించారు. పెట్రోల్, డీజిల్ నిల్వలను తనిఖీ చేశారు. వాహనదారులకు గాలిపంపులు లేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయనతోపాటు వీఆర్‌ఓలు సురేష్, రాజారాం, ప్రసాద్ పాల్గొన్నారు.

వీధికుక్కలకు స్టెరిలైజేషన్


వీధికుక్కలు పట్టి తరలిస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్: నగరంలో వీధికుక్కల స్టెరిలైజేషన్ (సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్స)కు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. నగర కమిషనర్ అరుణ ఆదేశాల మేరకు నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు, తిరుపతి పశుసంవర్ధక శాఖ పరిధిలోని ఏబీసీ (అనిమల్ బర్త్ కంట్రోల్) విభాగం సిబ్బంది సాయంతో శనివారం నగర పరిధిలోని 38, 32వ వార్డుల పరిధిలో 40 కుక్కలను పట్టి ప్రత్యేక వాహనంలో తిరుపతి పశుసంవర్ధక శాఖ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వీటికి స్టెరిలైజేషన్ నిర్వహించి, యాంటీ రేబీస్ టీకాలు ఇస్తారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అన్ని వార్డుల్లో పరిధిలో వీధికుక్కల స్టెరిలైజేషన్‌కు చర్యలు తీసుకుంటామని కమిషనర్ అరుణ తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతపై అవగాహన


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

చిత్తూరు కలెక్టరేట్ : అధునాతన సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన ముఖ్యమని ఎంఈవో సెల్వరాజ్ అన్నారు. స్థానిక మిట్టూరులో ఉన్న విజయం పాఠశాల 12వ వార్షికోత్సవాన్ని కల్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్తూరు ఎంఈవో సెల్వరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు వినియోగించే టెక్నాలజీపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యాసంస్థ చైర్మన్ తేజోమూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజ విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి వేగవంతం చేయాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తవణంపల్లె: ఉపాధి పనులను వేగవంతం చేసి లక్ష్యాన్ని అధిగమించాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లె, మారేడుపల్లె, దిగువ తడకర, ఉత్తరబ్రాహ్మణ పల్లె, గోవిందరెడ్డిపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలకు రేట్లు పెంచుతామన్నారు. కూలీలకు అనుకూలమైన పనులు ఎంపిక చేసి, వెంటనే బిల్లులు పెట్టాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓతో పాటు ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ లలిత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

ఐరాల: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం కోరం లేక వాయిదా పడింది. నిర్ణయించిన సమయం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. మిగతా సభ్యుల కోసం గంట సమయం నిరీక్షించారు. అయినా సభ్యులు హాజరుకాకపోవడంతో అనంతరం కోరం లేదని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి ప్రకటించారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఆదివారం ఉదయం 11 గంటలకు మళ్లీ మండల సర్వసభ్య నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

సుగుటూరు గంగమ్మకు గొడుగుల కానుక


గొడుగులను అందజేస్తున్న భానుప్రసాద్, రాజు

పుంగనూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీసుగుటూరు గంగమ్మ ఆలయానికి తిరుపతి నగరపాలక కార్యాలయ ఆర్‌వో, గతంలో పుంగనూరు కమిషనర్‌గా పని చేసిన కేఎల్‌వర్మ చెన్నైలో తయారు చేయించిన గొడుగులను కానుకగా అందజేశారు. మార్చి 14న అమ్మవారి జాతర జరగనుంది. ఈ సందర్భంగా గొడుగులను కమిషనర్ తరఫున పట్టణానికి చెందిన ఎస్టీ సంఘం నాయకుడు భానుప్రసాద్, దళిత సంఘ నాయకుడు రాజు మేళతాళాల నడుమ ఊరేగింపు వచ్చి గొడుగులను సమర్పించారు.

టీచర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న డీడీ నాగేశ్వరరెడ్డి

పూతలపట్టు: మండలంలోని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా వయోజన విద్య డీడీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ పోలింగ్ బూత్‌లో నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత నంబర్ 1 ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల అధికారులు అందజేసే పెన్నుతోనే సంఖ్యలను వేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు తమ పరిధిలోని గ్రామాల్లో ఉన్న పట్టభద్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈసీడీసీ పీడీ పద్మజ, ఎంఈఓ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం దామోదరనాయుడు, కె. హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ కన్వీనర్‌గా హనుమంత్‌రెడ్డి



చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా హనుమంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, బాలాజీ శనివారం వెల్లడించారు. హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

గుడిపాల: వన్యప్రాణుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తూర్పు అటవీ విభాగం అధికారి దేవరాజులు అన్నారు. క్రిష్ణజమ్మాపురంలో శనివారం ఆయన గ్రామస్తులతో అటవీ మరియు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవరాజులు మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాలు సకాలంలో కురవక కరువు కాటకాలు సంభవిస్తాయని చెప్పారు. అడవి జంతువులను వేటాడడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అడవి జంతువులను వేటాడిన వారిపై వన్యప్రాణి హక్కు చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా అడవికి నిప్పు పెట్టినట్లు తెలిసినా 9440810288కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో

చిత్తూరు అర్బన్: నగరంలోని 21వ డివిజన్ వార్డు సచివాలయాన్ని శనివారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలు, సంక్షేమపథకాల ప్రదర్శనల బోర్డులను చూశారు. హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించేలా చూడాలని ఆదేశాలిచ్చారు.


రికార్డుల పరిశీలనలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి